# ఎరికలమ్మ

స్కూలుకి ఆలిస్యమయిందని తొందరగా సైకిలు తొక్కుకొని పోతున్నాను. మధ్యాన్నం గుంటూరు రైలుస్టేషన్ Refrshment rooms లో టీ కప్పుముందు పెట్టుకుని ఆలోచనలో పడితే యెంత కాలం గడిచిపోతోందో తెలీదు. ఆలిస్యంగా వొచ్చానని, చిరునవ్వుతో నా మొహం వంక చూసేసాహేబు హెడ్మాస్టర్ని తలుచుకుంటేనే వొళ్లు కంపరమెత్తుతోంది. కోప్పడే వాళ్ళనీ, నోటీసులు పంపేవాళ్ళనీ, గొణుగుకొనేవాళ్ళనీ, ఊరుకునే వాళ్ళనీ భరించవొచ్చునుగాని తప్పు జరిగినప్పుడు చిరునవ్వు నవ్వే డెవిల్ని భరించడం కష్టం.

నా Old horse ని spur చేస్తూన్ననేను. చప్పున కళ్ళెం బిగించి ఆపాను. ఆస్పత్రి గోడపక్కన ఒక ఆమె నించునివుంది. ఏదో జ్ఞాపకం తళుక్కుమంది మెదడు వెనకాల ఎక్కడో. సైకిల్ దిగి నిదానించి చూశాను. అందమైన ఆడదాన్ని చూశానా గడ్డం హెడ్మాస్టర్లు వెయ్యిమంది, లక్ష చిరునవ్వులునవ్వనీ. నాకేం లక్ష్యం ? "నువ్వా" అన్నాను దగ్గరికి వెడుతో. ఆమె చదువుకున్న ఆడదైతే, ఒకానొకప్పుడు నేనెంతబాగా ఎరిగిన మనిషైనా చనువుగా పలకరించేముందు సంకోచింతును. చుట్టుపక్కల ఎవరున్నారో ఆమెచూపు యెట్లావుందో, అన్నీ ఆలోచించాలి. కాని ఎరికలదేగా ! "నువ్వా" అనడానికికూడా నాకు కారణంగాని, అధికారంగాని, లేవు. కాని అధికారంలేని పనులన్నీ మానేసి బతకగలనా, ఈహృదయం నశించిపోదా ? లోకమిచ్చిన అధికారాలు వొదులుకున్నాను. లోకం వొద్దన్న అధికారాలు కావాలని పోట్లాడతాను. అదేగా నా జీవితచరిత్ర. ఆస్పత్రి గోడపక్కన. యెండలో, తాటాకు బుట్టచేతపట్టుకుని నుంచుని వుంది ఆమె.

ఎరగనట్లు, నిదానంగా నావంకచూసింది ఒక నిమిషం. మళ్ళీ ఎక్కడానికి గుజ్జాన్ని తట్టుతున్నా. ఇంతలో ఆమె కళ్ళలో జ్ఞాపకం వెలిగింది. జాలిగా దిక్కులేనట్టు చూస్తున్న నల్లని మొహంమీద నవ్వు కమ్మింది అర్ధరాత్రి చంద్రోదయమైనట్టు. నిదానించి ఆలోచించి 'అల్లరి దాన్ని' అన్నది సిగ్గుతో, క్షమించమని కళ్ళు అడిగాయి.

ఆలోపలే, ఆమె కడపట చేసిన అవమానం నాకు జ్ఞాపకంవొచ్చి, సైకిలుదిగి పలకరించినందుకు సిగ్గుపడుతున్నాను.

మోటారులో రోడ్డు వెంట యింజనీరుగారు వెడుతున్నారు. టీపా ర్టీలో నన్ను కలుసుకొని ఏ గాలివల్లనో, స్నేహం చేసుకుని. రెండు మూడుసార్లు యింటికి రమ్మన్నారు. అఖరు, యీనాటితో యింక యింజ నీరుగారు పెద మొహం పెడతారు. ఆయన స్నేహానికి నీళ్ళు వొదిలాను ఆ వేడిరోడ్డు పక్కన. ఆస్పత్రి గోడ కింద తాటాకుబుట్ట పట్టుకుని నించున్న యెరికల మనిషితో చనువుగా మాట్లాడేవాడికి క్లబ్బు గతు లున్నాయా ?

ఆ ఇంజనీరే అట్లారాకపోతే, నేను సైకిలెక్కి వెళ్ళిపోయే వాణ్ణేమో ! ఇంకా యెవరైనా యింజనీర్లు రానీ ? వాళ్ళ తల్లీ భార్యల్ని రానీ, చూడనీమని ఆమెకి యింకా దగ్గిరగా వెళ్ళేను.

"ఇక్కడికి యెట్లా వొచ్చావు ?"

"ఆవూరూ యీవూరూ తిరుగుతూ."

నే నామెని మొదటిసారీ చివరిసారీ చూసింది ఒక మధ్యాన్నం గంటసేపు పెన్నదగ్గిర.

అది ఏప్రిలు నెల నెల్లూరులో. ఎన్నాళ్ళకీ స్కూలు ముయ్యరు నేనున్న కొత్తయింట్లో స్తానానికి వీల్లేదు, ఏమంటే, పక్కనేగా పెన్న అన్నారు. పక్కనే పెన్న యిసిక ! పెన్ననీరుకాదు. కొవ్వూరు వెళ్లాలి నీటికోసం. కొవ్వూరుదగ్గిర పెన్న చైత్రంలో పధ్నాలుగేళ్ళ పిల్లలా గుంటుంది. కల కల మని పరుగెత్తుతుంది. ఎండలో మెరుస్తుంది. పిచ్చిగా

వెచ్చగా వుంటుంది. చన్న చిన్న అలలు మాట్టాడితే మెలికలు తిరుగుతుంది. గంభీరమైన గోదావరి యీతలతో నదీజీవనం ప్రారంభించిన నాకు, యవ్వనవతి కృష్ణలో ఆటలాడి, చివరికి యీ పెన్నతో చిక్కులు పడాల్సి వొచ్చింది. కాలం గడిచినకొద్దీ పెన్నమీదే ప్రేమ ఎక్కువైంది; ఒక పెన్నమీదే కాదు.

కొవ్వూరి వొడ్డున పెన్న అనేక పాయలు. పాయల మధ్య చిన్న చిన్న యిసిక లంకలు. పగటి వెండ వేడి అంతా పోయ్యేట్టు వోపికగల మనుషులు రెండు మైళ్లూ నడిచి వొచ్చి, తలొక పాయనీ కావిలించుకొని పడుకుంటారు. రెండుచేతులూ చాపితే పాయ అంతా రొమ్ముకింద యిముడ్తుంది. పెన్న అలలు వీపు చుట్టూ అందుకోలేవు. తాపం పోవడానికని ఆ పాయ మీద ఇటూ అటూ దొర్లుతారు రసికులు. అందులో ప్రత్యేకం ఒక నీలపు పాయను నేను అధీనంలో ఉంచుకున్నాను. నా కన్న పెంద రాశే యెవడన్నా దాన్ని ఆక్రమించుకున్నాడా మండిపడతాను. కాని ఆ పాయ మీద నాకేమి అధికారముంది ? ఆ పాయ కిష్టమై ఆ మనిషి కిష్టమైతే నాకెందుకని యింకో పాయకి పోతాను. కాని ఆనందంలేక, తిరిగి వొచ్చి ఆపాయనే పంచుకుంటాను రెండో వాడితో. నా అంతటి వివేకమే అందరికీ వుండే యెంత బావుంటుంది లోకం ?

ఆరోజు సాయంత్రం నది మొదటి పాయ వొడ్డు యిద్దరు కనపడ్డారు, ఓ కుర్రాడు కుర్రదీ. కుర్రాడు యెక్కువ నలుపు. ఆమె చిరిగిపోయిన బట్టముక్క విడిచి అంతకన్న పేలికలుగావున్న వస్త్రం ధరిస్తోంది షోకుగా. ఎంతలాగినా బుజంమీద రెండో కొన నిలువదు పొడుగు; ఎంత పరిచినా రెమ్మ రెండుచివర్లనీకప్పదు, వెడల్పు. నవ్వాలో దుఃఖించాలో తోచలేదు.

అతను యానాదిమనిషి చూపుపెట్టి లోకంతో సంబంధంలేనట్టు నుంచున్నాడు. నన్ను ఆమెచూసింది. విడిచినబట్టని తీసుకొని నదిలో దిగింది. అతను ఒడ్డున యిసికమీద కూచున్నాడు. ఉతకడానికి వొంగేటప్పటికి ఆచిన్న పమిట కిందికిపడ్డది. నావంక చూసింది. పకపకా

నవ్వింది. ఆ నవ్వుకి నాలుగిందాల అర్థం కనపడ్డది, నానార్థాలు బోధించే వుపాధ్యాయుణ్ణి కనక గాబోలు. లాభంలేదని ఒదిలేసి బట్టవుతుకుతోంది. నాకు ఆమె శరీరాన్ని చూడ్డం చాలాసుఖంగావుంది. ఆమెకేమీ లక్ష్యం లేదు. ఆ మొదటిచూపు తరవాత ఆమెనన్నే మరిచిపోయినట్టుంది. నేనుం చున్నా వొకటే కుక్క నుంచున్నావొకటే ఆమెకి. బుద్ధిలో కూడా భేద మాటే లేదనిపించింది నాకు. అందువల్లనే నేనీ కథ వ్రాయడమూ నా సోదరులు చదివి ఆనందించడమూ కలిగాయి అనుకోండి.

చక్కని ముక్కు పల్చనీ ఎడమచంపమీద సూర్యుడు నిగ నిగ మంటున్నాడు. నాకు కనబడే యెడమరొమ్ము యెడమప్రక్క చర్మం సాగడం మూలంగా తెల్లగా ఉంది, ఆనీళ్ళలో తలయెత్తే చిన్నయిసిక తిన్నెవలె.

నేను చెప్పులు విడిచి, నాపాయని చేరుకుని, పడుకున్నాను. నా శరీరం నీళ్ళలో-నాకళ్ళు ఆకుర్రదానిమీద, పెన్నకాగా సహించింది. గోదావరైతే ఒక్కతన్ను తన్ని ఒడ్డుమీద పారేసును. లేకపోతే ఒక్క మునక ముంచి, ఇంక చూపులు లేకుండా చేసును.

బట్ట ఒడ్డున ఆరేసింది. నీళ్ళలోదిగింది. అతనూ దిగాడు. వెల్లి కితలా పడుకుని, ప్రక్కన కూర్చున్నఅతనిమీద నోటిలోనుండి నీళ్ళు చిమ్ముతోంది. చేపవలె కొట్టుకొని, అతని కాలు లాగుతూంది. గిలాగిలా కొట్టుకుని, జారి, పైకి లాక్కోమని చెయ్యి అందిస్తుంది. నవ్వుతుంది. అరుస్తుంది. అతన్ని చరుస్తుంది, రెచ్చకొడుతుంది దూరంగా పాకుతుంది. పిల్లిలాగు పొంచి దూకుతుంది. ఇసికి ముద్దలతో కొట్టింది. గులకలు విసిరింది. అతను కదలడు. అట్లా ఆనందంగా చూస్తూకూచుంటాడు కళ్ళు ఆమెకి వప్పచెప్పి. ఏమిటి గోల అని చిన్న పిల్లవంక చూశేట్టు చూస్తాడు. మళ్ళీ ఆమెకన్న వయస్సులో చిన్నవాడుగా కనిపిస్తాడు. శరీరం అంత చిన్నదిగా వున్నా ఆమెమొహంలో పాతికి ఏళ్లున్నట్లు కనపడ్డాయి. ఆ అల్లరేమీ అతని కిష్టంలేదనీ ఆమెమీద ప్రేమచేత భరిస్తున్నాడనీ అనిపించింది నాకు.

మా కుక్కలు జాన్, జిమ్మీ జ్ఞాపకం వొచ్చాయి. జిమ్మీ ఆటలమారి జాన్‌ని పీకి, కొరికి ఆడుకోమని అరిచి, ఇటూ అటూ దూకి గోల చేసింది. జిమ్మీమీది ప్రేమవల్ల జాన్ కదలక నుంచునేవాడు, అరవక, కరవక, [అవునా కాదా వాణీ !]

అల్లరంతా కానిచ్చి, మెల్లిగా ఆమెని పడుకోపెట్టి ఇసికతో ఒళ్ళంతా రుద్దుతున్నాడు. చిరునవ్వుతో అతని మొహం వంక చూస్తో, రాణీలాగు పడుకుంది. రాణీల పడకలు ఆ యిసికకన్నా ఖరీదు గలవేగాని సౌఖ్యం కలవా ? వాళ్ళిద్దరి తన్మయత్వాన్నీ చూసి నేను తీవ్రంగా యీర్ష్యపడ్డాను. బ్రతుకు అట్లా ప్రేమలో లీనమై, నన్ను నేనే మరిచిపోగలిగితే ! ఈ చదువులూ, పరీక్షలూ, వరండాలూ, భోజనాలూ, నగలూ, పుస్తకాలూ, కార్లూ, ఇన్‌స్పెక్షన్లూ, కుర్చీలూ, హెడ్మాస్టర్లూ—

అది ప్రేమేనా ? కవులుపాడే ప్రేమ అదేనా ? అనుకున్నాను. వాళ్ళకా కామమూ లేదు. పశుత్వమూ లేదు ఆ నిమిషాన. ఆమెది సన్నని వొళ్లు, ఒక్క తులం కొవ్వులేదు యెక్కడా, యెట్లా వొంచితే అట్లా వొంగేట్టు యెట్లా దాచితే అట్లా సాగేట్టు కనబడుతోంది. జింక వలె యెగురుతుంది. ఇటూ అటూ ఆడి అతని మొహం వంకచూసి "ఊ" అని కంఠంలోంచి ధ్వనిచేస్తే 'గ్రెటాగార్బో' యీమెనించే నేర్చుకుందా అనిపించింది. ప్రేమ ఎవరికన్నా ముఖంలో కంఠంలో మాధుర్యం తెప్పిస్తుందికదా ! చివరికి వేసవికాలంలో బనారసు చీరెకింద, వంటింటి పక్కగదిలో, పందిరిపట్టె మంచంమీద, చెవులో బండ గోపికలపటం కింద గర్భాదానం జరిగే చిలిమిడి ముద్ద కన్యకి కూడా—చివరికి.

గొప్ప అభిప్రాయాలూ, ఆత్మలు కలవడాలూ, మనోభావాల ఐక్యం పాతివ్రత్యం ఇవేమీలేనేలేవు. అట్లాంటి నాన్సెన్సేలేదు. ఇద్దరి మధ్యా యవ్వనమూ, ఆరోగ్యమూ, యిష్టమూ, యింకేం కావాలి ? నిన్నలేదు. రేపులేదు. ఆస్తిలేదు. హక్కులేదు. ఆనందమంటే వాళ్ళది.

5)

ప్రియురాలి కళ్ళలోకి చూస్తో ఆత్మవున్నదాలేదా, అని యోచించే నాకు ఆనందమేమిటి, ఈ లోకంలో.

తోకలేని కొంగ చేపల కోసం దేవుళ్ళాడుతోంది. సూర్యకిరణాలతో మెరుస్తూ లేత అలలు యిసికమీద ఆడుకుంటున్నాయి. ఆనకట్ట చివర ఒకడు పడిపోయినట్టు ఏమి బావుకుందామనో సైకిలెక్కి పోతున్నాడు వేగంగా. అధికారి ఎవడో తన దర్జాకి అదృష్టానికి పొంగుతో మోటారులో ఊరేగుతున్నాడు తనిఖీలకి. ఆ నల్లనిపిల్ల వీపుని నల్లనివాడు రుద్దుతున్నాడు యిసికతో. పిల్లలిద్దరూ ఆడుకుంటున్నారు పెన్నవొడ్డున.

ఆమె రొమ్ము రుద్దాడు. తొడలు రుద్దాడు. నేను చూస్తున్నా ఆమె కూడా తలయెత్తి చూడలేదు. అతని కళ్ళల్లో కించిత్ మార్పులేదు. నేను ఆమెస్త్రీ అని మరిచిపోయాను. అతనూ మరిచాడు. మొగుడూ పెళ్ళామేనా ఎంతకాలం వుంటుంది ఈ ప్రేమ, వాడింకేం చేస్తాడు. ఇల్లాంటి పవిత్ర ప్రశ్నలేమీ తట్టలేదు. అద్భుతమైన కవిత్వం చదువుతున్నట్టుంది. కదల కండానే అట్లా పడుకున్నాను తన్మయుణ్ణయి. వాళ్ళ ఆనందంలో నాస్తి తిని నా వునికిని నేనే మరిచి!

మెల్లిగా యెంకిపాటలు జ్ఞాపకం వొచ్చాయి. పాపం, సుబ్బారావు గారినీ అట్లానే అన్నారు. ఆయన 'ఎంకి'కి పెట్టిన భావాలు అసహజంఅంట చదువుకున్న వారికిగాని ఆ ఆలోచనలు వుండవుట. పుస్తకాల్లోంచి మాత్రమే జ్ఞానమూ, వేదాంతమూ, రసికత్వమూ, తెలుసుకోడం బాగా అలవాటే ఆ పుస్తకాలు చదవనివాళ్ళకి ఆ జ్ఞానమే రసికత్వమే వుండదని వాళ్ళ అభిప్రాయం. చదవనివాళ్ళకి వున్నాయో లేదోగాని, ఈ చదివిన వాళ్ళని నే నెరుగుదును. పుస్తకాల్లో, నాటకాల్లో, సినిమాల్లో తప్ప దేవుణ్ణిగాని స్త్రీనిగాని, బిడ్డనుగాని గొడ్డునుగాని ప్రేమించే శక్తి పూర్తిగా నశించింది. వీరిజ్ఞానమంతా ప్రేమించిన ఇంకోడు బొమ్మలువేసి చూపవలసిందే. తోటలో ఒక గంటసేపు రమ్యంగా తిరగలేరు. ఆ తోట అందం అట ఫొటో

యెత్తితేగాని, కనపడదు. రోజూ సూర్యోదయ సూర్యాస్తమానాలు అద్భుతంగా నెత్తిమీద జరుగుతూ వుంటే కళ్ళు మూసుకుని; సినిమాలో సూర్యోదయం చూపితే అరనిమిషం వూపిరి బిగపట్టి ఆనందిస్తారు. ఈ యిద్దరివంటి ప్రియులు ఆడుకోంటో వుంటే కసిరి అవతలకిపోయే ఛాంద సులును, సులోచన వెయ్యిమాట్లు స్టడీచేసి ఫొటో తీయించుకున్న చూపును పావలా పెట్టి కొని చప్పరిస్తారు. మొగవాడు స్తానం నరసింహరావు 'హా కృష్ణా' అని వెనక్కి విరుచుకుంటే యీ పురుషులందరూ, 'హా' యని ముందుకు వొంగుతారు.

నేను తుడుచుకుని, పాయలు దాటి వొచ్చేటప్పటికి ఆమె స్తానమై ఆరినబట్ట కట్టుకుని, తన బట్ట వుతుక్కుంటున్న అతనితో ఏదో చెప్పి నవ్వుతోంది. వాళ్ళ దగ్గిర నేను విడిచి వెళ్ళిన చెప్పుల వంక చూసి నవ్వుతున్నట్టుంది. చెప్పులు చక్కనివే. నవ్వెందుకు ? ఇట్లా అను కున్నాను.

"ఆయన వొచ్చేలోపున ఈ చెప్పులు తొడుక్కుని నువ్వు పరు గెత్తు" నీ గోచీతోసహా. ఆ గోచీ, ఈ చెప్పులు ఎట్లా వుంటావు రాజ కుమారుడిలాగ! హ హ హ ఆయనేం చేస్తాడు. ఆ తడిలాగుతో నీ వెంట పడతాడు. పడనీ, ఆ సంచీ యెత్తుకుని నేనిట్టాపరుగెత్తుతా? ఏంచేస్తాడేం ? ఎవరూ లేరులే చెప్పుల్ని ఆ డొంకలో విడిచి నువ్వుపో. సంచీ ఆ గట్టుమీద పారేసి నేవొస్తా." అంటోందేమో !

నేను వాళ్ళ దగ్గరగా వొచ్చి, చూస్తో నించున్నాను. అతను బట్ట వుతుకుతున్నంత సేపూ ఆడింది. నవ్వింది. గంతులేసింది. పాడింది. నాకు వొకమాటా అర్థంకాలేదు. ఒక్కొక్క పోజ్ ఎంతో అందమనిపించింది నాకు ! ఎక్కణ్ణించి వొస్తోంది. ఆ సంతోషం ఆ కవిత్వం, ఆ మధురమైన వొయ్యారం ! అతను తడిబట్ట పిండుకుంటున్నాడు. ఇద్దరూ వూరివేపు ప్రయాణమైనారు. ఆమె వెనక్కి తగ్గింది. నా వంక తిరిగి చూస్తోంది

దొంగతనంగా! వాళ్ళనే యింకా చూస్తూన్నట్టు కనపడడం సిగ్గేసింది నాకు. ఆమె కిందికి వంగి ఏదో యేరుకున్నట్టు కనబడి, నా వంక చూసింది. నేను నదివేపు తిరిగాను. పెళ్ళుమని నా వీపున ఇసిక పెళ్ళ పగిలింది. వెనక్కి తిరిగాను. నవ్వుతో పరుగెత్తుతోంది ప్రియుణ్ణి కలుసుకోడానికి. కోప్పడ్డానికి, అరవడానికి కూడా దూరంగా వున్నారు వాళ్లు.

ఆమె వుద్దేశం ఏమిటి ? కోపమా, ఇష్టమా, అల్లరా ? పోనీ ఆ గోల ఎందుకు ? మళ్ళీ కనపడతారా యేమన్నానా ? అనుకుని బైలు దేరాను. నా తోవ వాళ్ళ వెనకనే. శలవలకి మర్నాడు వూరికి పోతున్నాను పెన్నకి గుడ్‌బై.

వాళ్ళకేసి చూశాను. దూరంగా ఆ యిసిక మైదానంలో ఆ పంచని చెరో చెంగూ పట్టుకుని ఆరేసుకుంటో పోతున్నారు. ఒక చెంగు స్తంభానికి కట్టినట్టుంది. రెండో చెంగు తూలుతుంది. వొంగుతుంది. ఎగుర్తుంది వూడి కిందపడుతుంది.

అదీ ఆమెని నేను చూచిన ఆనాటి సంగతి.

ఆగి పెన్నవంక చూశాను. శలవు. చిన్న అందాలూ; ముద్దు ముద్దు శబ్దాలూ, చాతగాని వేళ్ళతో కౌగిలింతలూ, పిట్టవంటిముద్దులూ, అన్నీ మళ్ళీ నేను వొచ్చేటప్పటికి పెద్దదవుతుంది. కాళి రూపం దాలుస్తుంది. ప్రచండమారుతంతో వరదలు విసిరికొడుతో వుంటాయి. తన తోవదాటే నరుల్ని పెద్దనాలుకలు చాచి కబళించి మింగేస్తోవుంటుంది. విడవలేక మెల్లిగా ఆనకట్టవేపు వెళ్ళేను. ఆనకట్టకింద మడి రేవుతో మేము స్నానం చేసిన నీళ్ళు చేరుకునే గుంటలో, పారుదలే లేని ఆ మురికిలో, ముస లమ్మలు చెంబులు తోముతున్నారు. శ్రోత్రియులు మంత్రాలు చదివి స్నానం చేస్తున్నారు. ఈనాడు పావనమయింది మీ జన్మ ! ఆమె వీపు కడిగిన నీళ్ళు ఆచమనం చేస్తున్నారు. స్వర్గం కావాలా? మీకు ? ఎక్కడ వుంది స్వర్గం నల్లని వీపు తోమే భాగ్యంలేనిమీకు స్వర్గం ఏమిటి ? మోక్షమా ఈ

మడినించి ఈ దాదస్తంనించి ఈ మురికి నీళ్ళనించి ఈ స్వార్ధంనించి, ఈ నీతినించి ఎన్నటికి మీకు మోక్షం ? చల్లని గాలిలో, తెల్లని యిసికతో, పల్చని నీళ్ళలో కలిపి, పీపు రుద్ధలేని మోక్షాలెందుకు ?

సూర్యుడస్తమిస్తున్నాడు. ఎర్రగా, ఒక మబ్బులేక, గంధం కడిగిన సింహాచల నరసింహస్వామివలె దర్శనమిచ్చాడు. నాలుగు నిమిషాలు, అనకట్టమీద బొయ్యీ బళ్ళు, గొడ్లు, మనుషులు. ఆకాశం తెరమీద 'సిలట్టీ' లుగా కనబడుతున్నారు. ప్రతి దేహాన్నీ ప్రేమతో కావలించుకుంటోంది దక్షిణపు గాలి. ఆ యేటి మైదానమంతా కలిపితే యిరవై మంది లేరు. ఏం చేస్తోంది నెల్లూరు, వేలకొలది ప్రజలు ! కాఫీ హోటళ్ళలో, క్లబ్బుల్లో, సినీమాలలో గుమికూడారు. మూడు రూపాయలకి రాత్రంతా లభించే బుఱంలో సగం, గాలికి బహిరంగమైనట్టు, అరనిమిషం ఫోటో తీస్తే దాన్ని చూసి తృప్తి పడడానికి- ఈ వేసవి కాలంలో మూడు వందలమంది ఒకరి గాలి ఒకరు పీలుస్తో రేకులకింద చేరారు. కూర డబ్బులు గేటు దగ్గర వాళ్ళ కిచ్చుకుని, ఈ పెన్నానదిని వొదిలి 'రాణీ ప్రమీల'ను చూస్తున్నారు.

ఇదీ పాత కథ.

అనాడు ఆమె యిసిక పెళ్ళ విసిరిన సంగతి జ్ఞాపకంవొచ్చి సైకి లెక్కటోతో 'అతనేడీ'? అన్నాను.

ఆస్పత్రివేపు తల పూయించింది. కళ్ళలో నీళ్ళు నిండాయి.

"జబ్బా !"

తలపూయించింది. "పాపం" అన్నాను. ఇంకే మనను ?

"ఎన్నాళ్ళుంటారు ?"

చప్పున ఏడ్చింది.

"అయిపోయిందాకా."

నవ్వులతో భూమినీ ఆకాశన్నీ నింపిన పిల్ల ఈనాడు నాముందు యేడవడం సహించలేక పోయినాను బుజంమీద చెయ్యేశాను. అవును రోడ్డుమీదనే! నాకా యీ నాడు పోయేందుకు కేమీ మర్యాదలేదు. ఇక ఆమె-నగలులేవు చీరెలులేవు ఆమెకేం మర్యాద!

"డాక్టరు కుదరదన్నాడా? నేను వచ్చి డాక్టరుతో మాట్లాడనా?"

"పదిరూపాయలు కావాలిట."

"ఎవరికి?"

"డాక్టరికి. మందుకొని యెక్కించాలిట."

కొంగు కళ్ళకి అడ్డం పెట్టుకుని ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చింది. ఆ కదిలే రొమ్ము మీదికి వెళ్ళాయి నాకళ్ళు, చీరె యిదివరకంత చిరుగులు గాలేదు కాని కొంగు కళ్ళదగ్గరికి లాక్కుంటే రొమ్ము పూర్తిగా కప్పే టంత విశాలమయినది కాదు. ఆంధ్రపత్రిక నారీమణులవలె యెనిమిది గజాలు కొనలేరు పాపం ఈ బీదవారు.

"పెన్నదగ్గరకన్న కొంచెం అందం యెక్కువయింది కాని తగ్గ లేదు'" అనుకున్నాను, సిగ్గులేక. ఎంతప్రయతి ంచినాఆగవు ఈమాపులూ, ఈ కోర్కెలూ, పుటకతో వచ్చాయి. "సాయంత్రం మా యింటికి రా—"

ఆ మాటలు నేను అనడానికి కారణమేమిటి? ఆ రొమ్ము మీద కలిగిన ఆనందమూ, ఆ రొమ్ములో కలిగిన దుఃఖమా? రెండూనేమో మానవ స్వభావం అగాధమయినది.

సైకిలెక్కి వెడుతున్నాను. "ఇల్లెక్కడ" అన్నది. దిగి. చీట్వ్రాసి యిచ్చాను. ఆమె వంకచూసి, "తప్పకరా" అన్నాను స్కూలులో జాగ్రఫీ చెపుతున్నాను; పిల్లల్నితిట్టుతున్నాను. మేస్టర్లతో సణుగుతున్నాను. అదే ఆలోచన, కళ్ళముందు ఆమెదే రూపం. పదిరూపాయలు! బీదవాణ్ణి,

మరదలు పెళ్ళి అవుతోవుంటే మొన్న కట్నానికి డబ్బులేదు పొమ్మన్నాను, మామ నాకు జరపని లాంచనాల సంగతి దెప్పిపొడిచి, ఆ పది రూపాయలతో ఆగుతుందో, మెల్లిగా, ఇంకా—లాగుతుందో ?

ఆమె అడగలేదన్న సంగతి మరిచిపోయినాను.

పదిరూపాయలు ! రెండురోజుల జీతం. ఏమిటిలాభం నాకు ? ఈ లోకంలో ఓ ఎరికిలాడు చస్తేనేం బతికితేనేం ? ఆమెకోసమా! ఏమిస్తుంది? ఇస్తే ! తీరా యియ్యకపోతే ! అతనిమీద ప్రేమ సంగతి ఏంచేస్తాం ?- కాని ప్రేమవుంటేనేం, ఎంతవుందో !

"ముందే కండిషన్ పెట్టు" అంది ఒక చిన్న డెవిల్ నా చెవిలో.

"వీలైతే చూస్తాను" అన్నాను డెవిల్‌తో.

డాక్టర్ దగ్గిరికి వెళ్ళి కనుక్కుని ఆమె కథ అబద్ధంకాదని రూఢి చేసుకున్నాను. నా జాగ్రత్తకి నేనే సంతోషించాను. పూర్వం స్త్రీ కన్నీరు చూస్తేదాలు 'ఏంకావాలి, నామానమా ప్రాణమా ? ధనమా, కాలమా ?' అనేవాణ్ణి, ఆప్రకారం స్త్రీల క్షణికమైన whims కి బలిఅయి, మోసపోయి సిగ్గుపడి; కొంచెం ప్రూడెన్సు పాఠాన్ని నేర్చుకున్నాను.

నేను ఇంటికి వెళ్ళేటప్పటికే ఆమె అరుగుమీద కూర్చొనివుంది. ఆమెనిచూసి, దిక్కులేనట్టు అట్లాపడివుండడమూ; బిచ్చగత్తివలె వీధిమీద కూర్చోడమూ, రేగినజుట్టూ, ఆ ముతక చీరా, చూసి, మధ్యాహ్నం అంతచనువుగా ఎట్లామాట్లాడేనా అనిపించింది. మర్యాద, ఆచారమూ ఇవిచుట్టూగాలిలో ప్రాణవాయువువలె కలిసి కాచుకుని వుంటాయి. రోజూ మనస్సుని అవి వదిలిపోయేట్టు తోచకపోతే, రాగిపాత్రవలె Poisonous compounds form అవుతాయి.

లోపల కోటు తగిలిస్తోవుంటే ధర్మపత్ని 'ఎవతో కొత్తదివచ్చి కూచుందే వాకిట్లో,' అంది నవ్వుతో. నేను మర్యాదగా తక్కిన భర్తలవలె బ్రతుకుతానని కీర్తి సంపాదిస్తాననే ఆశకి యెప్పుడో నీళ్ళు వదులు

కుం?. డబ్బున్నా కొంచెం జాగ్రత్తపడతానేమో యెన్నటికన్నా అని ఆశ యింకా పోలేదు. ఆమె చూడకండా పదిరూపాయల నోటు జేబులో పెట్టుకుంటూవుంటే, ప్రొద్దున్న ఆమె బీరకాయలు అరవీశ, రెండు కానీల దమ్మిడీకి బేరమాడడం జ్ఞాపకంవచ్చింది. ఎప్పటికో కాసులపేరు చేయించు కుందామని ఆమె ఆశ.

అరుగుకింద నిద్రపోతున్న కుక్కమీదనించి పిల్లలు లాంగ్‌జంప్ చేస్తున్నారు. ఎదిరింటి కప్పుమీద కాకులు వరసగా కూర్చున్నాయి. కొబ్బరి చెట్టు ఆకు చివర్లు ఎండలో మెరుస్తున్నాయి. ఆమెలేచి నించుంది. నాఆలో చన అంతా బేరం ఎట్లా 'గ్రేస్‌ఫుల్'గా చేద్దామా అని. ఆమె కళ్ళలోని ఆశని భరించలేక, ముఖం తిప్పుకుని, విసురుగా 'ఇక్కడ వీల్లేదు. ఆస్పత్రి దగ్గరవుండు వస్తాను' అన్నాను కఠినంగా. ఇట్లా తిట్టడం కూడా ఒకందుకు మంచిదే ననిపించింది. హృదయంలోని కోర్కెకి ఎన్నిచిక్కులు పెట్టింది. అసహ్యమైన మాటలు, ఫీలింగ్సు, రేపింది! నావంక బిక్క మొహంతో చూసి 'నిజమేనా?' అంది.

"నిజం, వెళ్ళు."

కాళ్ళీడ్చుకుంటూ వచ్చినదోవనే పోతూంది. నేను సైకిలుమీద క్లబ్బుకి వెళ్ళి, లైమ్‌జూస్ అనే పేరుతో అణాతీసుకొని వాళ్ళిచ్చే వేపాకు రసం తాగి ఆంధ్రపత్రికలో, ఆ ప్రముఖులు దేశానికిచ్చే తెలివైన సలహా లను చదివి ఆనందించి, ఆస్పత్రి గోడ దగ్గిరికి చేరుకున్నాను. దీపాలు వెలిగిస్తూ వెడుతున్నాడు నిచ్చెనమనిషి గొప్పవారిపేరు, గొప్ప గొప్ప గోతులు కల రోడ్డు దుమ్ములోనుంచి తప్పించుకొని కందకం ప్రక్కన నిలుచున్న ఆమెని చేరుకున్నాను. బేరానికై హృదయాన్ని గట్టిచేసు కున్నాను. మరి నా హృదయంలో మధ్యాహ్నంనుండి పేరుకున్న మర్యాద మహాత్మ్యమో లేక ఏపనినైనా అనుమానాస్పదంగా—చేసేగుణం ఆ చీక ట్లోనే వుందో, ఆమెతో మాట్లాడడమంటే ఆమెతో కలిసి నిలుచోడమంటే సిగ్గుపడుతున్నాను. రాగిచెంబు చిలుముపట్టింది.

"తీసుకొచ్చారా?" సంతోషంతో ఆతురతతో ఆమె నల్లని పెదవులు వణుకుతున్నాయి. చెయ్యి కొంచెం చాచింది.

రాత్రికాగానే ఆడవాళ్ళలో అందంకూడా ఎక్కువగా కనబడుతుంది. అందులో ముఖ్యం నల్లనివాళ్ళది. దుమ్మూ ధూళీ కనబడవు.

తెనాలి రైలు కూత కూసింది. ఆమె దగ్గిరగా జరిగాను.

"ఇస్తాను నాకేమిస్తావు" అనేశాను. ఆ చీకట్లోనే ఆమెకర్థమైనట్లు తోచింది. 'మామూలేనేమో' అని సిగ్గుకి జవాబు చెప్పుకున్నాను. కాని మామూలైన మనిషేనా! అని నా డబ్బు విలవ కూడా తగ్గి బాధపడ్డాను.

చాలసేపు మాట్లాడలేదు. తర్వాత 'సరే' అంది.

ఆ 'సరే' అనే ఒక మాట నా హృదయంలోనుంచి దూసుకుపోయింది. నన్ను తిట్టినా, సిగ్గుపడ్డా, "అల్లాంటిదాన్ని కాను."

"అన్నా, ఇది ధర్మమా?"

"నీ డబ్బు దాచుకో" అన్నా భరించి ఉందును. కాని, ఆ 'సరే' నన్ను బాధించింది. నిశ్చయం, నిరాశ, తృణీకారం; నిస్సహాయం ఎన్నో స్ఫురించి కలవరపరిచాయి. నోటు చేతులోపెట్టాను. చేతిని గట్టిగా పట్టుకుంది. 'అఖ్ఖర్లేదులే' అనాలనిపించింది. దానికికూడా ధైర్యం రాలేదు. తల వంచుకొని ఆ రోడ్డుదుమ్ముకన్నా అధమంగా ఫీలవుతూ పోయాను. ముహూర్తనిశ్చయం చెయ్యడానికన్నా ధైర్యం లేకపోయింది.

మూడురోజుల తరవాత కాఫీహోటలునుండి నేనూ, దీక్షితులుగారూ; సుబ్బారావూవస్తున్నాము. నా తలనొప్పి కుదురుస్తానని దీక్షితులుగారు సూర్య నమస్కారాలు చేయిస్తున్నారు. రెండు పూటలా భోజనం తప్ప పనికిరాదని శాసించారు. ఆ వంక పెట్టి నన్ను యెదురుగా కూచోపెట్టుకొని యిద్దరూ నవ్వుతూ హాయిగా తింటున్నారు. దిక్కు మొగంతో

నేను వెంటనడుస్తున్నాను. సుబ్బారావుకి చాలా సంతోషంగా వుంది నా పత్యం.

తటాలున ఆస్పత్రి గోడవెనకనించి ఆమె వచ్చి నా చేతులు పట్టుకుంది. కళ్ళంబడి నీళ్ళు చెంపలమీదికివచ్చి రోడ్డుదుమ్మని కరిగిస్తున్నాయి.

"నెమ్మదిగావుంది. అన్నంతిన్నాడు" అంది చాలా ఉత్సాహంతో. కళ్ళు నిగ నిగ మన్నాయి యెండలో. ఇంకా నలుగురు పోగైనారు. సిగ్గుతో, తత్తరపడి 'సరే, సరే' అని నడిచి వెళ్ళిపోతున్నాను. వెనక్కిచూసేప్పటికి ఆమె 'ఇదేమిటా? నేనేం చేశాను. కోపం తెప్పించడానికి ?' అన్నట్టు చూస్తోంది. విద్య, మా స్నేహితులు, పేరు ప్రతిష్ఠలు ఆ ఇబ్బందులు ఎరగదు అనుకొని, క్లాసులో ప్రవేశించి, పదిమందికి ఇంపోజిషన్ యిచ్చాను.

రాత్రి రామాయణం చదువుతున్నాను. నాపత్ని విస్తరాకు పారెయ్యడానికి వెళ్ళి, 'అదెదో మళ్ళావచ్చిందండీ' అంది. బైటికి వెళ్ళాను. వచ్చి చప్పున నా కాళ్లు పట్టుకుంది. రోడ్డు దుమ్ములో మోకరించి, అహల్యవలె. "మీకు కోపం తెప్పించాను. ఎట్లానో నన్ను కనికరించాలి."

ఆమె బుజాలక్రింద చేతులువేసి లేవనెత్తడం బాగాఉంది. కాని ఇంటి కెదురుగా మునిసిపాలిటీ వారితో పోట్లాడి లాంతరు స్తంభం వేయించుకున్న అవివేకాన్ని తిట్టుకున్నాను. స్వార్థం కసితీర్చుకోక వదలదు.

"నాకేమీకోపంలేదు. పదిమందిలో మాట్లాడలేకేపోయానుఅంతే."

రోడ్డు యీ చివరా, ఆ చివరా, యెదురింటి తలుపూ కనిపెడుతున్నాయి నాకళ్ళు. నా చెంపలమీద చేతులు వేసి, 'ఎప్పుడు ?' అంది.

"ఈ రాత్రి పదకొండింటికి, యిక్కడే నిలుచుని ఉంటాను."

ఆమెకీ యిష్టమే ! దొంగ ! ఎట్లా దాచిందో ! నాకేదో ఉపకారం చేస్తున్నట్టు నటించింది. ప్రేమించింది నన్ను. డ్రెస్, ముఖంలో చదువు

కున్న కళ. ఎట్లానన్నా ఆ జాతివాళ్ళని ఆకర్షించి తీరతాయి. తరవాత వాణ్ణి వొదలి నా వెంట పడదుకద ! ఎట్లా వొదలించుకోడం ? ఆహా, ఎంత ఆతురత ! తనకితానే అడిగిందే ! ఒద్దులే అని నేనంటే, యేమనేదో! తమాషా చెయ్యవలసింది ! ఎట్లానన్నా నా జన్మే వేరు నన్ను వాంఛించని స్త్రీహృదయం ఉంటుందా ? ఇది యీ పాడు హిందూదేశమై పోయింది కాని, యింకో దేశమేఐతే, 'నెవారో' వలె అని కలల్లో పడ్డాను. అన్ని వైపులా నేనే. నా ప్రయోజనకత్వమే పదకొండింటిదాకా.

వొచ్చింది. తలుపు తీసి అరుగుమీద గదిలోకి చప్పుడు కాకుండా తీసుకెళ్ళాను. వెళ్ళగానే నా రొమ్ముకి అద్దుకున్నాను. తలలో తెల్లని పువ్వులు, చీరె వుతికినట్లు కొత్తనీటివాసన, ఇనుమువంటిదేహం కాని; యింకా నా 'స్కూ-ప్రిపుల్సు' పోలేదు. అదిగాక ఆ మొదటివలె వాంఛలేదు.

"నీ కిష్టమేనా ?"

"పోనిద్దురూ."

"వొదిలేవాణ్ణేమో. "కాని మీకూ...." అంది. ఎందుకు అన్నదో."

"నాకు చాలా కావాలి."

"ఐతే సరి."

చాప పరిచాను. ఆమెని ఆచాపమీద ఆ బూజుమూల పడుకోమనడం నాకు సిగ్గేసింది. పెన్న యిసికలు జ్ఞాపక మొచ్చి నిట్టూర్పు విడిచాను. ఈ గుంటూరులో ఆ ఆశలులేవు. నదిలేని ఊళ్ళో ఎందుకు బతుకుతారో మనుష్యులూ, దేశభక్తులూ, శారదారణ్యులూ !

ఆమె చిరుగులబట్టని దూరంగా పెట్టించాను. రోడ్డుదీపం వెలుతురు పడుతోంది. కాని కిటికీ ముయ్యవలసి వచ్చింది. చీకట్లో నవ్వే ఆమెపళ్లు తెల్లగా కనపడ్డాయి.

"ఏమిటి ?"

"ఏం లేదు."

ఏదో నన్ను వెక్కిరిస్తున్నట్టు తోచింది కాని నేను ఆలోచించ లేదు. ఆమె బట్టలే లేకుండా నిలుచుంటే చూస్తున్నాను. నేనాశపడ్డ ఆనందం యేమీలేదు హృదయంలో. తెచ్చుకోవాలని ప్రయత్నిందాను. ఆమెవంక చూశాను ఆతురతతో. చందనపు బొమ్మవలె, శిలావిగ్రహంవలె, నిలుచునివుంది. అంత చక్కని వొళ్ళు హంపీలో విగ్రహానికి చూసినట్టు జ్ఞాపకం. కాని ఆనందమేమీ కలుగలేదు.

"రా" నా పట్టుదలా 'క్యూరియాసిటీ' పని చేస్తున్నాయి కోర్కె కన్నా, ఆమెవొంట్లో మెత్తనిస్థలమన్న మాటలేదు. నాకు కొత్తగా వుంది.

లేచి చిరిగిన చీరెని తీసుకొని కట్టుకుంటుంది. కొంచెంగా కిటికీ తెరిచాను ఊపిరికోసం.

"మరి యింక నేను వెళ్ళనా ?"

ఏమీ సంతోషమివ్వని ఆ పని యెందుకు చేశానా అని అసహ్యపడు తున్నాను. నాకేమీ సౌఖ్యమివ్వక డబ్బు కాజేసినందుకు వేశ్యమీదవలె కోపంగాఉంది ఆమె మీద, కావలిసే మోసంచేసింది, నామీద కసిచేత. లేచి కోపంతో ఆమె మొగంమీద చెయ్యేశాను. ఆమెనవ్వుతున్నట్లుంది.

"ఎందుకు ?" నా అంతరాత్మ 'గిల్టీ'గా ఉంది.

"ఏమీలేదు." అన్నది.

"చెప్పాలి తప్పదు."

"పోనిద్దురూ."

"కాదు ఒట్టు."

"ఏమీలేదు. ఈమాత్రానికేనా అంతకోర్కె."

సీత సిగ్గుని దాచిన భూదేవి, బద్ధలై నన్నూ లోపలికితీసుకో కూడదా ? అంతకన్న అవమానంవుందా మొగవాడన్న వాడికి ? నిజమే. నిజమే ? అన్నదా ఆ మాట ! ఆ మాటకి అర్థం అదేనా !

“మరి నువ్వుచేసినపని న్యాయమేనా ?” అన్నాను కొనవూపిరితో.

“ఏం పని ?”

“నువ్వు చెయ్యనిపని !”

“అంటే ?”

ఎట్లా చెప్పాలోతెలీక వూరుకున్నాను. వెళ్ళబోతూ ఆమె నాచేతిని ప్రేమగా పట్టుకుంది. కృతజ్ఞతతో నేమో ఏమైతేనేం, భగ్నమైన నాఆశ. నా కాపీనం, నా నీచత్వం. అన్నీ కలిసి, ఏంచెయ్యలేక, చప్పున యేడ్చాను. తల్లివలె నాతలని వంచి నున్ననిరొమ్ములమధ్య అదుముకుంది.

“ఎందుకు ?”

“చెడ్డపని చేశాను.” అన్నాను.

“ఎందుకు అంత ఆత్రుతపడ్డావు ?”

“నాకోర్కె.”

“నేనెందుకు ? నాలో ఏముంది ? పిచ్చి ఎలికలదాన్ని.”

“నిన్ను ప్రేమించాను.”

“చూడు.” నా మొహం యెత్తింది. నా కళ్ళమీద వేళ్లువేసి.

“మీ జాతికి మా జాతికి కుదరదు” అని దగ్గరగా నన్ను హత్తుకుని గట్టిగా ముద్దు పెట్టుకుంది. పరవశత పొందాను. ఇంతమాత్రం ప్రేమ చూపితే, నా ప్రయత్నమంతా అట్లా భంగమయ్యేదా ? అన్యాయం చేసింది. ఇప్పుడేంలాభం అనుకుని ?

"మరి నీకు న్యాయమేనా ?"

"ఏమిటి ?" అన్నది.

"నామీద ప్రేమ చూపకపోవడం ?"

"నీకూ నాకూ ప్రేమ ఏముంది ?"

నోరు మూసుకున్నాను. కాని—

"పోనీ, ఇష్టం లేకపోతేనేం, సహాయం చేసివుండకూడదా?"

పదిహేనేళ్ళెందుకు చదువుకున్నాను ఆ మాత్రం 'ఆర్గ్యూ' చెయ్యలేకపోతే—ఆలోచించింది. చాలా దయగా —"నేనేం చెయ్యను ? మీరు నన్ను రేపందే ! మీకు శక్తిలేదు. మీరు వేరు మేము వేరు. అదే మావాడైతేనా !" అని చాలా సంతోషంతో "వారం రోజుల్లో వస్తాడు బైటకి, మా యిద్దరికీ పప్పన్నం పెడతారా !"

తడిసిన అలుకుగుడ్డ మల్లే యింటోకిపోయి మంచంమీద పడ్డాను.

పదుహేనేళ్ళ చదువు, పదేళ్ళ వుద్యోగం, చిన్నతనపు పెళ్ళి సంసారం—నన్ను యెరికల దానికి లోకువ చేశాయి. ఆ యెరికలాడు 'నా పెళ్ళాన్నేంచేశా' వని తిరగబడితే, పరిగెత్తాలి పోలీసు స్టేషన్కి.

"నీకు యిన్ని వేలు ఖర్చుచేసి, శ్రమపడి, బాగా తన్ని చదువు చెప్పించడంవల్లనే ప్రయోజకుడివైనావు" అంటారు పూజ్యులైన పెద్దలు.

ఇదీ నా ప్రయోజకత్వం.

[ఆమె ఈ భాష మాట్లాడలేదు. తెలుగే అదోరకం భారత ప్రయోగాలు వేసింది. చాలాసార్లు బూతులు మాట్లాడింది అవసరమైన చోట్ల. కొన్ని మాటలు మరిచిపోయాను. కొన్ని అచ్చులో వెయ్యనీరు. అందుకని నా భాషలో వ్రాశాను ఆమె సంభాషణకూడా.]

★